



## ప్రకృతి ఒడిలో

ఊళ్లో పచ్చని పొలాల మధ్య ఇల్లు కట్టుకుని, ఇంటి చుట్టూ పెరడు పెట్టుకుని, చెట్ల నీడలో పగటివేళ, వెన్నెల్లో రాత్రి హాయిగా గడపాలనుందని ఓ పట్నవాసి కోరిక. పెద్ద అపార్ట్‌మెంట్‌లో, చిన్న ఫ్లాట్ కొనుక్కుని, ఎండా, వానా ఇబ్బందుల్లేకుండా హాయిగా బతకాలని కలలు కంటుంటాడు ఓ పల్లెటూరి మనిషి. ఎక్కడున్నా ప్రకృతిని ధ్వంసం చేయకుండా, పచ్చదనం చెరిపేయకుండా పచ్చని నగరాన్ని విస్తరించుకుంటున్నారు డెన్మార్క్‌లోని కోపెన్ హెగెన్ నగర ప్రజలు. ఎక్కువ సౌకర్యాలు, తక్కువ విలాసాలతో నిర్మించిన గార్డెన్ సిటీ ఎంత బాగుందో కదా! దాదాపు 28 చదరపు కిలోమీటర్లు విస్తరించిన ఈ కాలనీలో గృహ సముదాయాల మధ్య విశాలమైన మైదానాలు పెంచుకుంటున్నారు. ఇళ్ల మధ్య కాంక్రీటు అడ్డుగోడలు కట్టకుండా పచ్చని చెట్ల వరుసలు పెంచుకుంటున్నారు. ఎంత బాగున్నాయో కదా గుండ్రని కాలనీలు!